నిరుపయోగంగా సీహెచ్‌సీ భవనం

- ప్రత్యామ్నాయ అవసరాలకు అనుకూలం
- వాడుకలో లేక శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అధ్వానంగా మారిన పరిసరాలు

కంకిపాడు: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనం ప్రస్తుతం నిరుపయోగంగా తయారైంది. ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించుకునే వీలు ఉన్నా అధికారులకు పట్టడంలేదు. వాడుకలో లేక భవనం శిథిలావస్థకు చేరువవుతోంది. ఇప్పటికే ధ్వంసమైన రేకుల షెడ్డు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారైందని స్థానికులు వాపోతున్నారు

పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మార్పు

కంకిపాడు పరిసర ప్రాంతాల్లోని 40 గ్రామాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు సెంటరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. 2010లో వైద్య సేవలు మెరుగుపరిచే ఉద్దేశంతో సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. అందులో భాగంగానే నిపుణులైన వైద్యులను సైతం నియమించారు. స్పెషలిస్టు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినా ఆస్పత్రి భవనం చిన్నదిగా ఉండటంతో మెరుగైన సేవలు అందక రోగులు ఇబ్బందులు పడ్డారు. సమస్యను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించేందుకు రూ.4.60 కోట్ల నిధులను కేటాయించింది. దీంతో పాటు పట్టణానికి చెందిన దాత కోట్లాది రూపాయలు విలువైన భూమిని ఆస్పత్రి భవన నిర్మాణానికి కేటాయించటంతో అధునాతన వసతులతో కూడిన భవనం నిర్మితమైంది. ఏడాదిపైగా స్పెషలిస్టు వైద్య సేవలు సమర్థంగా అందుతున్నాయి.



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనం



శిథిలమైన షెడ్డు

ప్రత్యామ్నాయం వైపు దృష్టి కరువు

పాత ఆస్పత్రి భవనం ఖాళీ చేయించి నూతన భవనంలో వైద్య సేవలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంది. అయితే పాత భవనాన్ని మాత్రం వదిలేశారు. ప్రత్యామ్నాయ చర్యలకు కేటాయించటంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆయుర్వేద, హోమియో వైద్య సేవలకు కేటాయించినా ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. కంకిపాడుకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందేలా మానిటరింగ్ టీమ్‌ను కంకిపాడు కేంద్రంగా కేటాయించారు. అయితే ఆ సిబ్బంది సైతం ఈ పాత ఆస్పత్రి భవనం నుంచి విధులు నిర్వహణకు ఉపక్రమించలేదు. ఫలితంగా భవనం పూర్తిగా నిరుపయోగంగా తయారైంది.



శిథిలావస్థకు చేరువైన భవనం

అధ్వానం.. శిథిలం..

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పాత ఆస్పత్రి ప్రాంగణం అధ్వానంగా తయారైంది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి, అడపాదడపా కురిసిన వర్షాలకు వృక్షాలు కూలటంతో ఆస్పత్రి ప్రాంగణంలో రోగులు వేచి ఉండేందుకు నిర్మించిన రేకుల షెడ్డు ధ్వంసమైంది. భవనం గోడలు బీటలు వారి, ఫ్లోరింగ్ దెబ్బతిని శిథిలావస్థకు చేరువవుతోంది. దీనికి తోడు రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు ఇక్కడ జోరుగా సాగుతున్నాయి. సువిశాల ప్రాంగణంలో ఉన్న ఆస్పత్రి భవనం తిరిగి వినియోగంలోకి తేవడానికి వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించి ప్రత్యామ్నాయ కేటాయింపులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. పాలిచ్చు తల్లులకు శాపం



ఉయ్యూరు బస్టాండ్‌లో బిడ్డలకు పాలిచ్చు గది



గదిలో చిందరవందరగా పడేసిన బ్యానర్లు

ఉయ్యూరు రూరల్: శిశువుకు పాలిచ్చు గదులను ఐసీడీఎస్ అధికారులు ఆర్భాటంగా ప్రారంభించి.. పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ఉయ్యూరు బస్టాండ్‌లోని బిడ్డలకు పాలిచ్చే గది మూతపడింది. పాలిచ్చు తల్లుల ఆత్మగౌరవానికి భంగం కలుగకుండా ఈ గదులను ఆర్టీసీ బస్టాండ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని బస్టాండ్లలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తున్నామని తల్లీబిడ్డల రక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని ఆర్భాటంగా ప్రకటించారు. ఆర్టీసీ, మునిసిపల్, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సమక్షంలో ఇటీవల ఘనంగా ప్రారంభించి రెండోరోజే మూసివేశారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో తమ బిడ్డలకు సంతోషంగా పాలు ఇవ్వవచ్చు అని భావించిన తల్లులకు బంగపాటు తప్పడం లేదు. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు స్పందించి ఉయ్యూరు బస్టాండ్‌లో శిశువుకు పాలిచ్చు గదిని కనీస సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. రాజీవ్ విద్యామిషన్(ఎస్ఎస్ఏ) పథకంలో భాగంగా 2008వ సంవత్సరంలో మండల వనరుల కేంద్రం పేరుతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంగా మార్పు చేశారు. విద్యాశాఖాధికారి కార్యాలయ భవనం శ్లాబు బలహీనపడి పగుళ్లిచ్చి వర్షం నీరు నిలిచి కురుస్తోంది. వర్షం నీరు నిలబడటంతో శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. సన్‌సైడుల పెచ్చులు కూడా ఊడి పడుతున్నాయి. పరిశుభ్రత కొరవడి గదుల్లో చెదలు పుట్టలు పుట్టలుగా ఏర్పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మండలంలోని 33 మండల ప్రాథమికోన్నత, మండల పరిషత్ పాఠశాలలకు ఇదే ఎంఈఓ కార్యాలయం. ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, దానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు పలు దఫాలు ప్రభుత్వానికి, మండల పరిషత్‌కు రాతపూర్వకంగా తెలియజేసినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆదుకుంటారేమోనని అధికారులు ఎదురు చూస్తున్నారు.



నున్నలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

ముగిసిన పదో తరగతి పరీక్షలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో పదవ తరగతి కామన్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 17వ తేదీన ప్రారంభమైన పరీక్షలు 13 రోజుల పాటు జరిగాయి. మండలంలోని 14 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో మొత్తం 2300 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలియజేశారు.

గన్నవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గన్నవరం మండల పరిధిలో మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజున సోషల్ సబ్జెక్ట్ పరీక్ష జరిగింది. మండలంలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పదవ తరగతి పరీక్షలు ముగిసినట్లు ఎంఈఓ-1 కొండా రవికుమార్ తెలిపారు.



నున్నలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

13న నగరంలో సమైక్యతా శంఖారావం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇటీవలి కాలంలో దేశ వ్యాప్తంగా సాగుతున్న మతతత్వ ధోరణులు, ప్రజల మధ్య విద్వేషాలు పెంచే విధంగా కేంద్రంలోని బీజేపీ పాలకులు చేస్తున్న కుట్రల నేపథ్యంలో సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు ఈ నెల 13వ తేదీన నగరంలో సమైక్యతా శంఖారావం నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మంగళవారం శంఖారావం సన్నాహక ప్రజాసంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంఖారావంకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో శాంతిని నెలకొల్పి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మని రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర స్థాయి సమైక్యతా శంఖారావం సదస్సులో ప్రజాస్వామ్య లౌకిక ప్రజాతంత్ర వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లివిల్సన్, కెవిపిఎస్ కార్యదర్శి నటరాజు, న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి పోలారి, జమలయ్య, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

పోక్సో కేసుల దర్యాప్తులో అప్రమత్తంగా ఉండాలి

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణి

విజయవాడస్పోర్ట్స్: పోక్సో కేసుల దర్యాప్తులో పొరపాట్లు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణి పోలీసులకు సూచించారు. పోక్సో కేసుల దర్యాప్తుపై జిల్లాలోని పోలీసు అధికారులకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీపీ కృష్ణవేణి మాట్లాడుతూ నేర స్థలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్ష్యాలు, ఆధారాలు సేకరించాలని సూచించారు. దర్యాప్తు అనంతరం చార్జ్‌షీట్‌ను సవివరంగా రూపొందించాలని చెప్పారు. ఈ విషయంలో విచారణ అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలి కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, డీసీపీలు ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణికి పోలీసు అధికారులు జ్ఞాపిక అందజేశారు.

బుడమేరు అండర్ టన్నెల్ విస్తరించాలి

రామవరప్పాడు: ఏలూరు కాలువ ఆయకట్టు బుడమేరు డ్రెయిన్ వల్ల వరదలతో మునిగిపోకుండా కాపాడటానికి ఎనికేపాడు అండర్ టన్నెల్‌ను విస్తరించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఏలూరు కాలువ కింది అండర్ టన్నెల్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల ఏలూరు కాలువకు జరిగిన నష్టాన్ని అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ ప్రాంతంలోని అండర్ టన్నెల్ బ్రిటీష్ కాలంలో 11 ఖానాలతో 4300 క్యూసెక్కుల వరదనీరు వెళ్లడానికి నిర్మించారని, దీనిని 22 ఖానాలుగా విస్తరించి 15 వేల క్యూసెక్కులు దిగువకు వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు కొసరాజు రాంబాబు, కొమ్మారెడ్డి రాజేష్, యార్లగడ్డ రవిబాబు, డ్రెయినేజీ ఏఈ శ్రీనివాస మూర్తి, గ్రామ మాజీ సర్పంచ్ కోనేరు శివరామకృష్ణ, గోగం బాలకోటేశ్వరరావు, గోగం శ్రీనివాసరావు, పటాపంచల వెంకట్రావు పాల్గొన్నారు.



ఎనికేపాడులో అండర్ టన్నెల్‌ను పరిశీలిస్తున్న ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తదితరులు

కనీస వేతనం చెల్లించాలని వినతి

రామవరప్పాడు: కనీస వేతన జీవో ప్రకారం పారిశుధ్య కార్మికులకు వేతనాన్ని పెంచి ఇవ్వాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గూడవల్లి పంచాయతీ కార్యదర్శి చింతలమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికి కేవలం రూ.8250 వేతనాన్ని మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. పక్క పంచాయతీలలోని కార్మికులకు రూ.12 వేల నుంచి రూ.13,500 వరకు వేతనం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. చాలీ చాలని వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు వేతనాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హైకోర్టు తీర్పు ప్రకారం టెండర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సచివాలయం సిబ్బంది అర్హులకు పింఛన్లు అందించారు. పలు గ్రామాల్లో సాంకేతిక సమస్య ఎదురవడంతో కొంత మేర ఇబ్బందులు తలెత్తాయి. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు.

35 మంది విద్యార్థుల ఎంపిక

ఉయ్యూరు: స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ తెలిపారు. టీచింగ్ ట్రీ సంస్థ, కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 120 మంది విద్యార్థులు హాజరవగా 35 మంది ఉద్యోగ అవకాశాలు సాధించారు. ప్లేస్మెంట్ సెల్ సర్వీస్ కన్వీనర్ అనిల్‌కుమార్, కిషోర్, శ్రీనివాసరావు, టీచింగ్ ట్రీ సంస్థ ప్రతినిధులు మురళి, సంతోష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉపాధి పనులు ప్రారంభం



కంకిపాడు: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కొండా నాగేశ్వరరావు, జి.రమణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతలు గంగిరెడ్డి లక్ష్మణరావు, గీత గాయత్రి దంపతుల సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మినుము, పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, పెసర పంటలను విక్రయించేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బాపులపాడు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని మంగళవారం తెలిపారు. మండల పరిధిలో 6,972 ఎకరాల్లో మినుము, 538 ఎకరాల్లో పెసర పంటలను సాగుచేసినట్లు ఆమె చెప్పారు. ఈ పంటను బహిరంగ మార్కెట్‌లో ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏవో భవాని వివరించారు.మండలంలోని ఆరుగొలను, పెరికీడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మినుము, పెసర కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పెసర మద్దతు ధర క్వింటా రూ.8682 కాగా, మినుము మద్దతు ధర క్వింటా రూ.7400 చెల్లించనున్నట్లుగా తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

ప్రమాదకరంగా రైవస్ కాలువ గట్టు



ఉయ్యూరు రూరల్: వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన రైవస్ కాలువ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. మండలంలోని కడవకొల్లు వంతెన పక్కన కాలువ గట్టు పూర్తిస్థాయిలో కోతకు గురైంది. రానున్న సీజన్‌కు సాగునీటిని ఈ కాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులు అందించనున్నారు. కాలువ పూర్తిస్థాయిలో నీటితో నిండుకుంటే కోతకు గురైన ప్రాంతంలో పూర్తిగా గట్టు తొలగిపోయి పరిసర ప్రాంతంలోని పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉంది. కోతకు గురైన ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు పరిశీలించి త్వరగా కాలువ గట్టును పటిష్ట పరచాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణల చెరలో కాలువ కట్ట




పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు వంతెన దిగువున కాలువ కట్ట వద్ద ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఇంతలా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నోరు మెదపడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెన దిగువున సాగునీరు అందిస్తున్న బందరు కాలువ కట్టను కొందరు ఆక్రమించి ఏకంగా కాలువ అంచుల్లో నిర్మాణాలు చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవటం లేదని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో బందరు కాలువే మాయమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం



పెనమలూరు: మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ పరిశోధన డీన్ ప్రొఫెసర్ సీహెచ్.లక్ష్మీకుమారి అన్నారు. కానూరు సిద్ధార్థ అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో సమాన అవకాశాల విభాగం ఆధ్వర్యంలో మహిళా శక్తి, సమష్ట చర్య అంశాలపై మంగళవారం జరిగిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఐక్యరాజ్యసమితి పేర్కొందని వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాన అవకాశాల విభాగం చైర్మన్ బేబీరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం



గన్నవరంరూరల్: క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని రెవరెండ్ ఫాదర్ కూచిపూడి జ్ఞానానందం అన్నారు. మండలంలోని కొండపావులూరు ఆర్సీఎం విచారణ పరిధిలోని కట్టుబడిపాలెంలో మంగళవారం రాత్రి తపస్సు కాల శిలువ మార్గాన్ని నిర్వహించారు. యేసుక్రీస్తు వేషధారణలో క్రీస్తు పడిన శ్రమలను తెలుపుతూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జ్ఞానానందం ప్రసంగిస్తూ మానవాళి పాప విమోచన కోసం యేసుక్రీస్తు ఎన్నో శ్రమలను అనుభవించారని చెప్పారు. తపస్సు కాలంలో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేయాలని చెప్పారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ సురేష్ దివ్యబలిపూజను సమర్పించగా ఏలూరు మేత్రాసనం రెవరెండ్ ఫాదర్ వినోద్ ప్రసంగించారు. దేవుని సేవలో 33 ఏళ్లు పూర్తి చేసుకున్న ఫాదర్ జ్ఞానానందాన్ని మరియదళం సభ్యులు, సంఘ పెద్దలు, దుశ్శాలువాలు, పూలమాలలు, బొకేలతో సత్కరించారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని గ్రామ ఉపసర్పంచ్ అద్దేపల్లి సాంబశివనాగరాజు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సిండికేట్ బ్యాంక్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. డ్రెయిన్ల నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చిందని, రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్, నభిగాని కొండ, కొంగన రవి, తుమ్మల బాబు, చంటి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు గ్రామంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, తహసీల్దార్ భావనారాయణ, ఎంపీడీఓ పి.అనూష, ఈఓఆర్‌డీ కిరణ్మయి, ఈఓ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉయ్యూరులో ప్రజా దర్బార్

ఉయ్యూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్‌ను ఉయ్యూరులో బుధవారం నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.

4న మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

6న శ్రీరామనవమి వేడుకలు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. ఈ నెల ఆరో తేదీన నవమి సందర్భంగా స్థానిక రామాలయంలో పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపింది. ఉదయం 9 గంటలకు శ్రీ సీతారామస్వామి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం మహా అన్నసమారాధన జరుగుతాయని కమిటీ తెలిపింది.